సాక్షి
అన్నమయ్య జిల్లా
గురువారం । 14 । నవంబర్ । 2024

పరుగు.. సైన్యం దాకా!



ఒకటే గమ్యం.. ఒకటే లక్ష్యం... సైన్యంలో కొలువు సాధించడమే ధ్యేయంగా అభ్యర్థులు పరుగు సాగించారు. కడప నగరంలో నిర్వహిస్తున్న అగ్నివీర్ ఆర్మీ రిక్రూట్‌మెంట్‌లో భాగంగా నిర్వహిస్తున్న ఎంపికల ప్రక్రియకు వర్షం స్వల్ప అంతరాయాన్ని కలిగించింది. కడప డీఎస్‌ఏ స్టేడియం అభ్యర్థులకు నిర్వహించాల్సిన 1.6 కి.మీ పరుగు పందెంను వర్షం కారణంగా నగరంలోని మహావీర్ సర్కిల్ నుంచి రిమ్స్ రహదారిలో నిర్వహించారు. -కడప స్పోర్ట్స్

న్యూస్‌రీల్

గడువు పొడిగింపు

రాయచోటి (జగదాంబసెంటర్): జవహర్ నవోదయ విద్యాలయ (జేఎన్‌వీ) లేటలర్ ఎంట్రీ సెలక్షన్ టెస్ట్–2025కు దరఖాస్తు గడువును ఈ నెల 19వ తేదీ వరకు పొడిగించినట్లు అన్నమయ్య జిల్లా విద్యాశాఖాధికారి బాలసుబ్రమణ్యం ఒక ప్రకటనలో తెలిపారు. 2025–26 విద్యా సంవత్సరంలో 9, 11వ తరగతులలో ఖాళీ సీట్లకు ప్రవేశం కోసం ఆన్‌లైన్ అప్లికేషన్ల సమర్పణ చివరి తేదీ గడువును ప్రభుత్వం పొడిగించిందన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

విద్యార్థిని కొట్టిన ఉపాధ్యాయుడి సస్పెన్షన్

రాయచోటి : విఘ్నేష్ అనే విద్యార్థిని కొట్టి గాయపరిచిన తెలుగు ఉపాధ్యాయుడు లోకేష్‌ను సస్పెండ్ చేసినట్లు జిల్లా విద్యాశాఖాధికారి టి.సుబ్రమణ్యం తెలిపారు. సుండుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థి విఘ్నేష్‌పై జరిగిన సంఘటనకు సంబంధించి జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఆదేశాల మేరకు విచారణ చేపట్టినట్లు బుధవారం డీఈఓ పత్రికలకు విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఉపాధ్యాయుడు లోకేష్‌ను సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీ చేశామన్నారు.

కూలీల పెంపునకు ప్రత్యేక చర్యలు

పెద్దతిప్పసముద్రం: జిల్లాలో ఉపాధి హామీ కూలీల సంఖ్యను పెంచేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని జిల్లా డ్వామా పీడీ వెంకటరత్నం అన్నారు. ఉపాధి హామీ ద్వారా కందుకూరు చెరువు కొండపై వెలసిన వరాహ లక్ష్మీ నరసింహస్వామి ఆలయానికి రోడ్డు సౌకర్యం కల్పించే విషయమై క్షేత్ర స్థాయిలో విచారణ చేసేందుకు పీడీ బుధవారం మండలంలోని కందుకూరు వ్యాసరాయ చెరువు కట్టకు చేరుకుని పరిశీలించారు. చెరువులో నీళ్ళు అయిపోయాక పూడికతీత పనులు చేపడతామన్నారు. మట్టి రోడ్డు పనుల మరమ్మతులకు సంబంధించి ప్రతిపాదన సిద్ధం చేసి పంపాలని మండల సిబ్బందిని ఆదేశించారు. అనంతరం పీడీ విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో ఫారంపాండ్, సప్లై చానల్, ఉద్యానవన పంటల సాగు, 1200 గోకులం షెడ్లు లాంటి పనులు జరుగుతున్నాయన్నారు. ఆయన వెంట ములకలచెరువు క్లస్టర్ ఏపీడీ మధుబాబు, ఏపీవో తిరుమాలప్ప, ఈసీ మహేష్, టీఏ శంకర్‌లు ఉన్నారు.

డిసెంబర్ 15లోపు పంటల బీమా చేసుకోవాలి

రామాపురం: డిసెంబర్ 15వ తేదీ లోపు రబీ సీజన్‌లో సాగు చేసిన వరి, వేరుశనగ పంటలకు పంటల బీమాను నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి చంద్రనాయక్ రైతులకు సూచించారు. మండలంలోని హసనాపురం, చిట్లూరు రైతు సేవ కేంద్రాల్లో బుధవారం జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి పంటకు ఎకరానికి రూ.126, వేరుశనగ పంటకు ఎకరానికి రూ.96 ప్రీమియం చెల్లించి బీమా చేసుకోవాలన్నారు. వరి పంటకు రూ.42 వేలు, వేరుశనగ పంటకు రూ. 32 వేలు బీమా వర్తిస్తుందన్నారు. ఈ సమావేశంలో లక్కిరెడ్డిపల్లి వ్యవసాయ సహాయ సంచాలకులు జయరాణి, రైతు సేవా కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

'సవేరా' వెంకటయ్య కన్నుమూత



కడప కల్చరల్ : రాష్ట్రంలోనే సుప్రసిద్ధ రంగస్థల కళాకారుడు, దర్శకునిగా పేరుగాంచిన కడప నగరానికి చెందిన ఆళ్లూరి వెంకటయ్య (91) మంగళవారం రాత్రి 9.30 గంటలకు కన్నుమూశారు. కడప నగరం ఎన్జీఓ కాలనీలోని తన స్వగృహంలో ఆయన మరణించారు. వెంకటయ్య సవేరా ఆర్ట్స్ పేరిట రంగస్థల సంస్థను స్థాపించి రాష్ట్రంలోనే ఉత్తమమైన కళా సంస్థగా తీర్చిదిద్దిన విషయం తెలిసిందే. సురభి నాటక సంస్థ పుట్టిన మన జిల్లాలో ఆ తర్వాత రంగ స్థల విభాగంలో సవేరా సంస్థను గొప్పగా తీర్చిదిద్దారు. పౌరాణిక నాటకాలలో అత్యంత క్లాసిక్‌గా రామాయణాన్ని ఐదు భాగాలుగా ప్రదర్శించి తనదైన శైలిని, రామాయణంపై తనకుగల మక్కువను చాటుకున్నారు. కడప, ప్రొద్దుటూరులతో పాటు కర్ణాటక, ఉత్తర భారతదేశంలోని పలు నగరాలలో ఐదు భాగాల రామాయణాన్ని అత్యంత వ్యయ ప్రయాసల కోర్చి సినిమాకు దీటైన సెట్టింగులు తదితర హంగులతో ప్రదర్శించి సవేరా వెంకటయ్యగా పేరు తెచ్చుకున్నారు. వ్యక్తిగతంగా 8 నంది అవార్డులతో కలిపి సంస్థ నాటకాలకు 28 నంది బహుమతులు సాధించి పెట్టారు. పలుమార్లు ఆయన రాష్ట్ర నంది అవార్డుల పోటీలకు న్యాయ నిర్ణేతగా వ్యవహరించి కీలకమైన సమయాల్లో వివాదాలను పరిష్కరించారు.

అనుసంధానంపై నీలినీడలు!

- టీడీపీ కూటమి ప్రభుత్వం రాకతో ఆగిన పనులు
- తాజాగా అయాచిత లబ్ధిపేరుతో విచారణకు ప్రభుత్వం ఆదేశం
- వైఎస్సార్, అన్నమయ్య, చిత్తూరు జిల్లాలకు మహోత్తర పథకం గాలేరు–నగరి, హంద్రీ–నీవా అనుసంధానం
- రూ.4,373.23 కోట్ల పథకంలో రూ.961 కోట్ల పని పూర్తి
- పథకం ఆపితే మూడు జిల్లాలపై సాగు, తాగునీటికి తీవ్ర ప్రభావం
- కృష్ణా జలాలు అందక రిజర్వాయర్లు ఎండాల్సిందే



వైఎస్సార్‌జిల్లా తక్కెళ్లపల్లె వద్ద ఆగిపోయిన ఎత్తిపోతల పనులు

బి.కొత్తకోట: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టిన హంద్రీ–నీవా, గాలేరు–నగరి సాగునీటి ప్రాజెక్టుల అనుసంధాన పథకంపై నీలినీడలు అలుముకున్నాయి. టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత చురుగ్గా సాగుతున్న పనులకు బ్రేక్ పడింది. పనులపై ప్రభుత్వ కక్ష సాధింపు నిర్ణయాలకు ఈ ప్రాజెక్టు బలవుతుందా లేక రైతాంగ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని కొనసాగిస్తారా అన్నది చర్చనీయాంశమైంది. మరోవైపు ఈ ప్రాజెక్టు పనులకు గత ప్రభుత్వం కాంట్రాక్టు ఏజెన్సీకి అయాచిత లబ్ధి ఏమైనా చేకూరిందా అన్న కోణంలో ప్రభుత్వం విచారణకు ఆదేశించడం చూస్తుంటే పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

- వైఎస్సార్, అన్నమయ్య, చిత్తూరు జిల్లాలకు కృష్ణా జలాలను తరలించి సస్యశ్యామలం చేసే ఈ పథకాన్ని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టగా మొన్నటి దాక పనులు ముమ్మరంగా జరిగాయి. 2021 జూలై 4న తంబళ్లపల్లె నియోజకవర్గం నాయనచెరువుపల్లె వద్ద పనులకు శ్రీకారం చుట్టారు. పథకం పనులకు గత ప్రభుత్వం రూ. 5,030 కోట్లు మంజూరు చేయగా టెండర్ల ద్వారా రూ.4,373.23కోట్లకు పనులను కాంట్రాక్టర్‌కు అప్పగించారు. ఈ పనులు త్వరితగతిన సాగుతుండగా ఐదునెలలుగా ఆగిపోయాయి. ఇది పూర్తయితే హంద్రీనీవా ప్రాజెక్టు ఉప కాలువలు, ప్రధాన కాలువ, ప్రధాన రిజర్వాయర్లకు కృష్ణాజలాలు పుష్కలంగా అందుతాయి.
- అన్నమయ్య, చిత్తూరు జిల్లాకు 1,550 క్యూసెక్కుల కృష్ణా నీటిని తరలించి 20 టీఎంసీలను సద్వినియోగం చేసుకోవాలన్న మహోత్తర పథకం ఇది. జీఎన్ఎస్ఎస్- హెచ్ఎన్ఎస్ఎస్ ఎత్తిపోతల పథకంగా పిలవబడే ఈ పథకం ద్వారా గండికోట రిజర్వాయర్ నుంచి నీటిని వినియోగించుకునే లక్ష్యంలో 13 టీఎంసీలు ఉమ్మడి చిత్తూరు జిల్లాకు దక్కుతాయి.

రూ.961 కోట్ల పనులు

రూ.4,373.23కోట్ల అనుసంధాన పనుల్లో ఇప్పటివరకు రూ.961 కోట్ల పని జరిగింది. ఇందులో రూ.145 కోట్ల బిల్లులను ప్రభుత్వం చెల్లించాల్సి ఉండగా పెండింగ్‌లో పెట్టింది. జరిగిన పనుల్లో తంబళ్లపల్లె నియోజకవర్గం పెద్దమండ్యం మండలంలో 500 మీటర్ల పైప్‌లైన్, ములకలచెరువు మండలంలో 12 కిలోమీటర్ల పైప్‌లైన్‌లో ఐదు కిలోమీటర్లు పని జరిగింది. పెద్దతిప్పసముద్రం మండలం పులికల్లు వద్ద పుంగనూరు ఉపకాలువలోకి నీటిని తరలించేలా గ్రావిటీ కాలువ 500 మీటర్లు తవ్వారు. గాలేరు–నగరి నుంచి కృష్ణా జలాలు హెచ్ఎన్ఎస్ఎస్ పుంగనూరు ఉపకాలువలోకి నీళ్ల డెలివరీ సిస్టం లింక్ పనులు పూర్తయ్యాయి. వైఎస్సార్ జిల్లాలో గండికోట రిజర్వాయర్ నుంచి నీటిని తరలించి నింపే 0.225 టీఎంసీ సామర్థ్యం కలిగిన కాలేటివాగును 1.20 టీఎంసీల రిజర్వాయర్ సామర్థ్యానికి పెంచి నిర్మాణం పూర్తి చేశారు. ఇక్కడి నుంచి 55 కిలోమీటర్ల పైప్‌లైన్ పని జరిగింది. తర్వాత కల్లూరుపల్లె రిజర్వాయర్ పనిని పూర్తి చేశారు. కాలేటివాగుకు నీటిని తరలించేందుకు దీనికి ముందు నిర్మించాల్సిన 5.5 కిలోమీటర్ల టన్నెల్ పనుల్లో 700 మీటర్ల పని జరిగింది. కొంతమేర ఎత్తిపోతల పనులు జరిగాయి. కల్లూరివారిపల్లె ఎత్తిపోతల నుంచి నీటిని అన్నమయ్య జిల్లాలోని వెలిగల్లు ప్రాజెక్టుకు, అక్కడి నుంచి తంబళ్లపల్లె పెద్దేరు ప్రాజెక్టు ద్వారా ములకలచెరువు మండలం మీదుగా పీటీఎం మండలంలోని పుంగనూరు ఉపకాలువలోకి నీటిని తరలిస్తారు. మరో మార్గం ద్వారా పెద్దమండ్యం మండలంలోని హంద్రీనీవా ప్రధాన కాలువకు నీటిని అందిస్తారు.

23 శాతం అయితే రద్దా

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో చేపట్టిన పనులు 25 శాతంలోపు ఉంటే వాటిని రద్దు చేస్తూ కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ లెక్కన అనుసంధాన ఎత్తిపోతల పథకం పనులు 23 శాతం పూర్తయ్యాయి. అంటే ఈ పథకాన్ని రద్దు చేస్తారా లేక కొనసాగిస్తారా అన్నది చర్చనీయాంశమైంది. కరువు ప్రాంతాలను సస్యశ్యామలం చేసే ఈ పథకం ఎంతో కీలకమైనది. మూడుజిల్లాల రైతాంగానికి ప్రయోజనం కలిగించడమేకాక ఆయకట్టు సాగులోకి రావడం, ప్రజలకు తాగు నీటిని అందించవచ్చు. కూటమి ప్రభుత్వం రాకతో ఐదునెలలుగా పనులపైనా ప్రభావం చూపింది. ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకుంటుందో తెలియక కాంట్రాక్టు సంస్థ పనులపై ఆసక్తి చూపడం లేదు. ఈ పథకం పనులు కొనసాగించడం ద్వారా మూడు జిల్లాలకు కలిగే ప్రయోజనంపై ప్రభుత్వం దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది.



తంబళ్లపల్లె నియోజకవర్గం పుంగనూరు ఉప కాలువలోకి కృష్ణా జలాలు తరలించే లింక్ కాలువ

నిధులపై విచారణకు ఆదేశం

ప్రాజెక్టుల అనుసంధాన పథకం పనులపై కూటమి ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. గత ప్రభుత్వంలో చేపట్టిన ఈ పనులకు సంబంధించి టీడీపీకి చెందిన ప్రతినిధి చేసిన ఫిర్యాదుపై జలవనరులశాఖ కార్యదర్శి విచారణకు ఆదేశించినట్టు సమాచారం. గత ప్రభుత్వం కాంట్రాక్టు సంస్థకు అయాచితంగా నిధుల విషయంలో ఏమైనా లబ్ధి చేకూరిందా, అలా జరిగివుంటే ఏ విధంగా జరిగింది అనే దానికి సంబంధించిన వివరాలను సేకరించి నివేదించేందుకు విచారణ అధికారిగా అనంతపురం ప్రాజెక్టు సీఈ నాగరాజును నియమించినట్టు తెలిసింది. పనులపై ఏ నిర్ణయం తీసుకునే పరిస్థితి ఎలా ఉన్నా విచారణ పేరుతో కాలయాపన చేసేలా కనిపిస్తోంది.

పథకం ద్వారా నీటి వాటా

హంద్రీ - నీవా ప్రధాన కాలువకు: 750 క్యూసెక్కులు
పుంగనూరు ఉపకాలువకు: 800 క్యూసెక్కులు
నీటి తరలింపు: 20 టీఎంసీలు

ఆధారపడిన రిజర్వాయర్లు

అన్నమయ్యజిల్లా...
ముదివేడు: 2 టీఎంసీలు
ఆయకట్టు: కొత్తగా 20 వేల ఎకరాలు
15 వేల ఎకరాల స్థిరీకరణ
చెరువులు (తంబళ్లపల్లె): 95
చెరువులు(రాయచోటి): 125
వెలిగల్లు: 2 టీఎంసీలు
(నీటి కరువు ఏర్పడితే)
శ్రీనివాసపురం, అడవిపల్లె రిజర్వాయర్లు: 5 టీఎంసీలు

చిత్తూరుజిల్లా..
ఆవులపల్లె: 3.5 టీఎంసీలు
ఆయకట్టు: కొత్తగా 40 వేల ఎకరాలు
20 వేల ఎకరాల స్థిరీకరణ
నేతికుంటపల్లె: ఒక టీఎంసీ
ఆయకట్టు: కొత్తగా 10 వేల ఎకరాలు
5 వేల ఎకరాల స్థిరీకరణ

వైఎస్సార్ జిల్లా
కాలేటి వాగు: 1.20 టీఎంసీలు
కల్లూరిపల్లె ట్యాంకు: 0.12 టీఎంసీ
చెరువులు: 65

తాగునీరు

తంబళ్లపల్లె, మదనపల్లె, పీలేరు, పుంగనూరు నియోజకవర్గాలు

కృష్ణా జలాల తరలింపు..

తంబళ్లపల్లె నుంచి మదనపల్లె, పుంగనూరు, పలమనేరు మీదుగా కుప్పానికి

ఇల్లు కట్టుకోకుంటే పట్టా రద్దు చేయండి

రాజంపేట టౌన్: ఎవరికైనా సొంత ఇల్లు ఉండి కూడా ప్రభుత్వం నుంచి ఇంటి స్థలం పొంది ఆ స్థలంలో ఇల్లు నిర్మించుకోని వారు ఉంటే క్షేత్రస్థాయిలో విచారించి వారి ఇంటి పట్టాను రద్దు చేయాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ తహశీల్దార్‌ను ఆదేశించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభాభవనంలో బుధవారం వివిధశాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో కలెక్టర్ దిశానిర్దేశం చేశారు. గృహ నిర్మాణాలు, అపార్ నమోదు, హౌస్ హోల్డ్ జియో ట్యాగింగ్, ప్రజల అర్జీల పరిష్కారం తదితర అంశాలపై ఆయన సమీక్షించారు.

పాత్రికేయులను అవమానించిన అధికారులు

ఎంపీడీఓ కార్యాలయ సభాభవనంలో కలెక్టర్ సమావేశాన్ని కవరేజ్ చేయాలంటూ అధికారులు పాత్రికేయులకు సమాచారం పంపారు. దీంతో పలువురు పాత్రికేయులు వెళ్ళగా తొలుత వేదిక ముందు కుర్చీలను వేశారు. అయితే కలెక్టర్ వేదిక పైకి వెళ్లేందుకు ఇబ్బందిగా ఉంటుందని, అందువల్ల వెనక కూర్చోవాలని అధికారులు తెలియచేశారు. అయితే అక్కడ కూర్చునేందుకు కుర్చీలు లేక పోవడంతో నిలబడే కవరేజీ చేయాల్సి వచ్చింది.

వ్యవసాయ రుణాలను రీ షెడ్యూల్ చేయాలి

జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్

రాయచోటి: జిల్లాలో కరువు మండలాల్లో వ్యవసాయ లోన్లను త్వరగా రీషెడ్యూల్ చేయాలని జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్ బ్యాంక్ అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం రాయచోటి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్సు హాల్‌లోజిల్లా కలెక్టర్ అధ్యక్షతన, జిల్లా ఎల్డీఎం ఆధ్వర్యంలో జిల్లాస్థాయి కన్సల్టేటివ్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ముందుగా ఎల్డీఎం ఆంజనేయులు జిల్లాలో రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన కరువు మండలాలకు సంబంధించిన వివిధ మార్గదర్శకాలను వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలో 19 మండలాలు ఉన్నాయన్నారు. జిల్లాలోని కరువు మండలాలకు సంబంధించి వ్యవసాయ లోన్లను త్వరగా రీషెడ్యూల్ చేసి రైతులకు ఇబ్బంది లేకుండా చేయాలన్నారు. కొత్త వ్యవసాయ లోన్లను రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఇచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో వివిధ బ్యాంకులకు చెందిన అకౌంట్లు ఆధార్‌కు అనుసంధానం కాలేదన్నారు. ఈ సమావేశంలో వివిధ బ్యాంకులకు చెందిన అధికారులు, డీసీసీ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



బ్యాంక్ మేనేజర్ల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్

ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్య సాధనకు కృషి

ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను ఆయాశాఖల అధికారులు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం రాయచోటి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్సు హాల్‌లో డీఆర్‌డీఏ, పర్యాటకం, పంచాయతీ రాజ్, నైపుణ్యాభివృద్ధి, ఐసీడీఎస్, ఆరోగ్య తదితర శాఖలకు సంబంధించిన లక్ష్యాలపై కలెక్టర్ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, సీపీఓ వెంకట్ పాల్గొన్నారు.

లక్ష్య సాధనలో నిర్లక్ష్యం వద్దు

నందలూరు: ప్రజల అర్జీలు పరిశీలించి త్వరితగతిన సమస్యలు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్ మండల స్థాయి అధికారులను ఆదేశించారు. బుధవారం నందలూరు ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో సీఎంఓ, పీజీఆర్ఎస్ దరఖాస్తులు, విద్యార్థులకు అపార్ ఐడీ జనరేషన్, హౌస్ హోల్డ్ జియో ట్యాగింగ్, ఇండ్ల నిర్మాణ ప్రగతి, ఎన్‌సీపీఐలో బ్యాంక్ అకౌంట్లకు ఆధార్ లింక్ అంశాలలో తహశీల్దార్లు, ఎంపీడీఓలు, డీటీలు, వీఆర్‌ఓలు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, ఇతర మండలస్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆయా అంశాలలో తీసుకోవాల్సిన చర్యలపై కలెక్టర్ దిశా నిర్దేశం చేశారు. అంతకు ముందు సర్వే రాళ్ల మార్కింగ్ అంశంలో భాగంగా నందలూరు మండలంలో సర్వే పూర్తి అయిన నల్లతిమ్మాయపల్లె గ్రామంలో సర్వేరాయిపై ఉన్న భూహక్కు భూరక్ష అక్షరాలు, బొమ్మలు మిషన్‌తో చెరిపివేసే పనిని కలెక్టర్ పరిశీలించారు. ఈ సమావేశంలో రాజంపేట ఇన్‌చార్జ్ ఆర్డీఓ లీలారాణి, సర్వే ఏడీ భరత్ కుమార్, డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహానికి 104 ఉద్యోగుల వినతి



అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పిస్తున్న 104 ఉద్యోగులు

రాయచోటి అర్బన్ : తమ సమస్యల పట్ల తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్న పాలకులకు మంచి బుద్ధిని ప్రసాదించి సమస్యలను పరిష్కరించేలా చూడాలంటూ 104 ఉద్యోగులు బుధవారం సాయంత్రం అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు 104 ఉద్యోగులు మాసాపేట బ్రిడ్జివద్ద గల అంబేడ్కర్ విగ్రహం వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెరుగుతున్న ధరలకు అనుగుణంగా జీతాలను పెంచకపోవడం వలన తమ కుటుంబాలు కష్టనష్టాలను ఎదుర్కొంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. 104 వాహనాలను నిర్వహిస్తున్న అరబిందో యాజమాన్యం పీఎఫ్ బకాయిలను తమ ఖాతాలలో జమ చేయడం లేదన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజులు, నాయకులు మాధవ, నాగిరెడ్డి, వినయ్, బాలక్రిష్ణంరాజు, నాగార్జున, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక తరలింపుపై ఆగ్రహం



రెవెన్యూ అధికారులను అడ్డుకుంటున్న జంగాలపల్లె గ్రామస్తులు

సిద్దవటం : రాష్ట్ర ప్రభుత్వ ప్రవేశ పెట్టిన ఉచిత ఇసుక పాలసీ అంటే గ్రామ అవసరాల వినియోగానికా లేక ఇతర ప్రాంతాలకు తీసుకెళ్లి అమ్ముకోవడానికా అని జంగాలపల్లె గ్రామ ప్రజలు బుధవారం అధికారులను నిలదీశారు. సిద్దవటం మండలం జంగాలపల్లె గ్రామ సమీపంలోని పెన్నానది నుంచి ఇసుకను ఇతర ప్రాంతాలకు తరలించేందుకు కమ్మపాలెం గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు ప్రయత్నించారు. అక్కడ వ్యవసాయ మోటార్లు ఉండటంతో పార్టీలకు అతీతంగా జంగాలపల్లె గ్రామ ప్రజలు అడ్డుకొని పెన్నానదిలోకి ట్రాక్టర్లు వెళ్లకుండా దారికి అడ్డంగా గోతిని తీశారు. ఆ గోతిని పూడ్చేందుకు వచ్చిన రెవెన్యూ అధికారులను గ్రామ ప్రజలు అడ్డుకున్నారు. గత రెండు రోజులుగా జంగాలపల్లె ప్రజలకు, కమ్మపాలెం వాసులకు మధ్య వివాదం జరుగుతోంది. తమ గ్రామంలో ఇసుక తవ్వకాల వల్ల వ్యవసాయ మోటార్ల పైప్‌లైన్ దెబ్బతింటే నష్ట పరిహారం చెల్లిస్తారా అని రెవెన్యూ అధికారులను గ్రామస్తులు ప్రశ్నించారు. ఇసుకను తమ గ్రామం నుంచి కాకుండా కమ్మపాలెం, సిద్దవటం వద్ద ఉన్న పెన్నానది నుంచి తీసుకెళ్లవచ్చు కదా అని ప్రశ్నించారు. దీనిపై జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

భలే బాలలు!

- సృజనకు పదును
- అద్భుతాలతో అదుర్స్
- పలు రంగాల్లో ప్రావీణ్యం
- రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో రాణింపు
- నేడు బాలల దినోత్సవం

ఆసక్తి ఉన్న రంగాల్లో చిన్నారులు దూసుకుపోతున్నారు. చదువు, క్రీడలు, డ్యాన్స్ ఇలా ఒకటేమిటి అన్నింటా ప్రతిభాపాటవాలతో అదరగొడుతున్నారు. తల్లిదండ్రుల ప్రోత్సాహం, గురువుల శిక్షణతో తమ ప్రతిభకు పదును పెడుతున్నారు. రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభను ప్రదర్శిస్తూ తమకంటూ గుర్తింపు సొంతం చేసుకుంటున్నారు. నేడు భారత తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ జయంతి. ఆయన జయంతిని బాలల దినోత్సవంగా నిర్వహించుకోవడం అందరికీ తెలిసిందే. బాలల దినోత్సవం సందర్భంగా పలువురు చిన్నారుల ప్రతిభా పాటవాలపై 'సాక్షి' ప్రత్యేక కథనం. – మదనపల్లె సిటీ

పిట్ట కొంచెం.. నాట్యం ఘనం



మదనపల్లె పట్టణం విజయభారతి పాఠశాలకు చెందిన గాయిత్రి పదో తరగతి చదువుతోంది. తల్లిదండ్రులు రాజగోపాల్, సుజాతల ప్రోత్సాహంతో మూడవ తరగతి నుంచి బాలాజీశర్మ వద్ద భరతనాట్యంలో శిక్షణ పొందుతోంది. ఈ అమ్మాయి ఆంధ్ర, తెలంగాణ, కర్నాటక రాష్ట్రాల్లో ప్రదర్శనలు ఇచ్చి మన్ననలు పొందింది. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన గిన్నీస్‌బుక్ ఆఫ్ రికార్డ్స్ కార్యక్రమంలో పాల్గొని ప్రతిభ కనబరిచింది. ఇప్పటి వరకు నాట్యశారద, నాటరాజ పురస్కార్, భారత్ ఆర్ట్స్ అకాడమీచే నంది అవార్డులు అందుకుంది.

కరాటేలో దిట్ట మోక్షజ్ఞన్

మదనపల్లె పట్టణంలోని కేశవరెడ్డి పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న కె.మోక్షజ్ఞన్ ఆత్మరక్షణ క్రీడ కరాటే పోటీల్లో దూసుకుపోతున్నాడు. జాతీయ, రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో మెడల్స్ సాధించాడు. 2022లో కర్నూలులో జరిగిన ఇంటర్ స్టేట్ కరాటే ఛాంపియన్‌షిప్ పోటీల్లో కటా విభాగంలో గోల్డ్‌మెడల్ సాధించాడు. 2022 గుంటూరులో జరిగిన నేషనల్ కరాటే ఛాంపియన్‌షిప్ పోటీల్లో కుమితే విభాగంలో గోల్డ్‌మెడల్ సాధించాడు. 2023 తిరుపతిలో జరిగిన సౌత్ ఇండియా కరాటే పోటీల్లో కటా విభాగంలో గోల్డ్, కుమితే విభాగంలో సిల్వర్ మెడల్ సాధించాడు. 2024 చిలకలూరిపేటలో జరిగిన నేషనల్ లెవల్ కరాటే టోర్నమెంటులో కమితే విభాగంలో గోల్డ్ మెడల్ సాధించాడు.



ట్రోఫీ, మెడల్స్‌తో మోక్షజ్ఞన్

ఫుట్‌బాల్‌లో నరేష్ జోష్..



ట్రోఫీ, మెడల్స్‌తో నరేష్

మదనపల్లె మండలం సిద్దమ్మగారిపల్లెకు చెందిన డి.నరేష్ ఇంటర్మీడియట్ చదువుతున్నాడు. ఫుట్‌బాల్ పోటీల్లో రాణిస్తున్నాడు. ఈ ఏడాది జూన్‌లో ఎన్టీఆర్ జిల్లాలో జరిగిన జూనియర్ బాలుర రాష్ట్ర ఫుట్‌బాల్ పోటీల్లో జిల్లా నుంచి ప్రాతినిథ్యం వహించి ఉత్తమ ప్రతిభ కనబరిచాడు. అస్సాంలో జరిగిన జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో పాల్గొన్నాడు. జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో పోటీల్లో పాల్గొని బహుమతులు అందుకున్నారు. ఫుట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి మురళీధర్, అధ్యక్షులు దిలీప్‌కుమార, అంజనప్పల వద్ద మెళుకువలు నేర్చుకుని ఫుట్‌బాల్ పోటీల్లో రాణిస్తూ అందరికి చేత శభాష్ అనిపించుకుంటున్నాడు.

కీర్తన... ఆట సూపర్



మెడల్స్‌లో కీర్తన

మదనపల్లె పట్టణం జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన కీర్తన తొమ్మిదో తరగతి చదువుతోంది. తల్లిదండ్రులు సుధాకర్, సునిత ప్రోత్సాహంతో రోప్ స్కిప్పింగ్‌లో ప్రతిభను చాటుతోంది. జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభను కనబరుస్తోంది. కర్నూలు, భీమవరం, నైనటాల్‌లలో జరిగిన రాష్ట్ర స్థాయి రోప్‌స్కిప్పింగ్ పోటీల్లో పాల్గొని మెడల్స్ అందుకుంది. పీడీ సుధాకర్ సూచనలు, సలహాలతో రోప్‌స్కిప్పింగ్‌లో రాణిస్తోంది.

హాకీలో సాయి సత్తా



వెంకటసాయి

హాకీలో వెంకట్ సాయి సత్తా చాటుతున్నారు. మదనపల్లె మండలం సీటీఎం జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న వెంకటసాయి జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచారు. పీడీలు నరేష్, నాగరాజల సలహాలతో హాకీ క్రీడలో రాణిస్తున్నాడు.